కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

చిత్తశుద్ధి ఉంటే ఎన్‌డీఎస్‌ఏ సూచించినట్టు 7వ బ్లాక్‌ను మళ్లీ కట్టి ప్రాజెక్టును వాడుకోండి

- వైఫల్యం కప్పిపుచ్చుకునేందుకే అబద్ధాలతో రేవంత్‌రెడ్డి సర్కారు తప్పించుకుంటున్నది
- మేము ఒక్క ఉద్యోగం ఇవ్వలేదంటున్నవ్.. ఉద్యోగాలిచ్చినట్టు నిరూపిస్తే సారీ చెప్తావా?
- ఒక్క ఇరిగేషన్‌శాఖలోనే వెయ్యి ఉద్యోగాలిచ్చాం
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ సవాల్

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలిందని పదేపదే కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తాజాగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) తన నివేదికలో సూచించినట్టుగా 7వ బ్లాక్‌ను తిరిగి నిర్మించి ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆ పని తొందరగా చేయాలని సూచించారు. రాజకీయాలు ముఖ్యమా? రైతుల ప్రయోజనాలు ముఖ్యమా? అని నిలదీశారు. ఈ సంవత్సరం ఎస్సారెస్పీలో నీళ్లు లేక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాలం కానప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతులకు వరప్రదాయని అని చెప్పారు. హైదరాబాద్‌లో గురువారం 'టీ న్యూస్'తో హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజలకు అన్నీ తెలుసని, అన్నింటినీ గమనిస్తుంటారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్ల అవినీతి అని మంత్రి అంటుండగా, లక్షా యాభైవేల కోట్ల అవినీతి అని మరో మంత్రి చెప్తున్నారని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసింది కేవలం రూ.94 వేల కోట్లేనని స్పష్టంచేశారు.

కాళేశ్వరంతో 20 లక్షల ఎకరాల్లో పంట

'కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదని ఓ మంత్రి అన్నారు. కానీ, నిన్న సీఎం రేవంత్‌రెడ్డి 50 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని చెప్పారు. నిండు శాసనసభలో సాగునీటి రంగంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. అందులో కాళేశ్వరం ప్రాజెక్టులో కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కింద 20 లక్షల ఎకరాల్లో పంట పండిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజీలు, 98 కిలోమీటర్ల పేసర్ మేన్స్, 203 కిలోమీటర్ల టన్నెల్, 1,530 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 16 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంపింగ్ స్టేషన్లు.. ఇలా కాళేశ్వరం అంటే మెగా ప్రాజెక్టు. ఇందులో వందల కంపోనెంట్స్ ఉన్నాయి. అందులో ఒక్క కంపోనెంట్ మేడిగడ్డ. ఆ మేడిగడ్డలోని 7వ బ్లాక్‌లో రెండు పిల్లర్లు మాత్రమే కుంగిపోయాయి' అని హరీశ్‌రావు వివరించారు.

తప్పని నిరూపిస్తే క్షమాపణ చెప్తావా రేవంత్

'మేము ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి అంటున్నారు. ఒకవేళ ఉద్యోగాలు ఇచ్చినమని రుజువు చేస్తే క్షమాపణ చెప్తావా? ఇవ్వలేదు అంటే నేను ముక్కు నేలకు రాయడానికి సిద్ధంగా ఉన్న' అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. 2016 మే 27న ఇవాళ రేవంత్‌రెడ్డి ఎక్కడైతే ముఖ్యమంత్రిగా నియామకం పత్రాలు ఇచ్చారో అక్కడే మేము నియామక పత్రాలు ఇచ్చాము. ఒక్క ఇరిగేషన్ శాఖలోనే 1000 ఉద్యోగాలు ఇచ్చాము' అని హరీశ్‌రావు స్పష్టంచేశారు.

మాట తప్పింది మీరు..

'రూ.2 లక్షల రుణమాఫీ ఒక్కేసారి చేస్తాం అని మాట తప్పారు. నిరుద్యోగ భృతి అన్నారు.. మాట తప్పారు. సంవత్సరంలోపే 2 లక్షల ఉద్యోగాలు అన్నారు.. మాట తప్పారు. మీరు ఇచ్చింది 10 వేలలోపు ఉద్యోగాలు మాత్రమే. అశోక్‌నగర్ మెట్ల మీద మీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ. నువ్వు (రేవంత్‌రెడ్డి) నిరుద్యోగులను మోసం చేశారు. పరీక్ష నిర్వహణలోనూ రేవంత్‌రెడ్డి ఫెయిల్ అయ్యారు' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

ఆడబిడ్డలతో కాళ్లు కడిగించడం క్షమించరాని నేరం

'తెలంగాణ ఆడబిడ్డలతో దేశవిదేశాల నుంచి వచ్చిన అందాల భామల కాళ్లు కడిగించడం దుర్మార్గపు చర్య. తెలంగాణ అడబిడ్డలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం క్షమించరాని నేరం. ఈ ప్రభుత్వం వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తా అన్నారు. వారంతా ఎక్కడ ఉన్నారు? వడ్డీ లేని రుణాలు అన్నావు. ఎక్కడ ఇచ్చారు? ఇవాళ వడ్డీలు మహిళా సంఘాలు కడుతున్నాయి' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

నాడు కేసులు వేసింది రేవంత్‌రెడ్డే

'పచ్చ కామెర్లు వచ్చినోడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. రేవంత్ కూడా అంతే. ఆనాడు పాలమూరు ఎత్తిపోతల పథకంపై పదుల సంఖ్యలో కేసులు వేసింది ఈ రేవంత్‌రెడ్డే. ఆనాడు కేసులు వేసి కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకున్నది ఈ రేవంతే. ఆనాడు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాకుండా కేసులు వేసి అడ్డుకున్నది ఈ కాంగ్రెస్ పార్టీనే. కేవలం రేవంత్‌రెడ్డి చేతగానితనం, తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

లక్షల కోట్ల టెండర్లు వేస్తరు.. ఉద్యోగులకు డబ్బుల్లేవా?

'నాడు కేసీఆర్ ఇదే రాష్ట్రంలో 73 శాతం పీఆర్సీ ఇచ్చారు. ఉద్యోగులకు కూడా రైతుబంధు ఇచ్చారు. ఈ రేవంత్‌రెడ్డి ఎందుకు ఇవ్వలేకపోతున్నారు. మేము రాగానే డీఏలు ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారు, ఏమైంది? దేశంలో ఉద్యోగులకు అత్యధిక డీఏలు పెండింగ్ ఉన్న రాష్ట్రం ఇప్పుడు తెలంగాణ అయింది. 100 రోజుల్లో అన్నీ చేస్తాం అన్నారు. 500 రోజులు అన్నారు.. ఏమైంది? రైతుల విషయంలో, ఉద్యోగుల విషయంలో రేవంత్‌రెడ్డి పగ బట్టారు. లక్షల కోట్లతో టెండర్లు పిలుస్తున్నారు? మరి రైతులకు, ఉద్యోగులకు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఏమైంది?' అని హరీశ్‌రావు నిలదీశారు.

అన్నదాత గోసపై రివ్యూ ఎందుకు చేయవు?

'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వాతావరణశాఖ హెచ్చరిక రాగానే మంత్రులను, అధికారులను అలర్ట్ చేసేవారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నది.. రైతుల ధాన్యం తడిసిపోతుంది వారికి కవర్లు అందజేయండి. కొన్న వడ్లను వెంటనే తరలించండి అని ఆదేశాలిచ్చేవారు. అందాల రాశుల గురించి ఆలోచన చేస్తున్న ప్రస్తుత ముఖ్యమంత్రి.. అన్నదాతల ధాన్యం రాశుల గురించి ఎందుకు ఆలోచన చేయడం లేదు? అందాల పోటీలపై కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రివ్యూ చేస్తారు కానీ అన్నదాత అరిగోసపై రివ్యూ ఎందుకు చేయరు?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

ఎంపీ రవిచంద్ర దయాగుణం

- గల్ఫ్‌లో చనిపోయిన నల్లగొండ జిల్లా వాసి మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించిన ఎంపీ
- రూ.3 లక్షలు సొంతంగా భరించి దాతృత్వం

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర దయాగుణాన్ని, దాతృత్వాన్ని మరోమారు చాటుకున్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లి అక్కడే మృతవాత పడిన నల్లగొండ జిల్లా వాసి మృతదేహాన్ని సొంత ఖర్చులతో స్వస్థలానికి రప్పించారు. జిల్లాలోని చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన శ్రీరాములు బతుకుదెరువు కోసం సౌదీ అరేబియా వెళ్లారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన రియాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శ్రీరాములు మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించడం ఎలాగో, ఎవరిని కలవాలో, ఎంత ఖర్చవుతుందో తెలియక తీవ్ర మానసిక క్షోభ అనుభవించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతల సహకారంతో ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మృతదేహాన్ని ఇండియాకు రప్పించేందుకు సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపారు. మృతదేహం హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు ఏర్పాటుచేశారు. సుమారు రూ.3 లక్షలు ఖర్చు కాగా, ఎంపీ సొంతంగా భరించారు. ఎంపీ రవిచంద్ర చొరవతో మృతదేహం విమానంలో హైదరాబాద్ విమానాశ్రయం, అక్కడి నుంచి బుధవారం రాత్రి స్వస్థలమైన వెలిమినేడుకు చేరుకున్నది. శ్రీరాములు చివరి చూపు తమకు దక్కేలా చేసిన ఎంపీకి శ్రీరాములు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రెస్‌మీట్ పెట్టిన నెలకు అట్రాసిటీ కేసు!

- కౌశిక్‌రెడ్డిపై సనత్‌నగర్ పీఎస్‌లో రాములునాయక్ ఫిర్యాదు, కేసు నమోదు
- కేసు బంజారాహిల్స్‌పీఎస్‌కు బదిలీ చేసిన అధికారులు
- గ్రూప్-1పై ఆరోపణలు చేసిన నేతలపై సర్కార్ కక్ష సాధింపు
- కేసు బదిలీపై అనుమానాలు

బంజారాహిల్స్, మే 15: టీజీపీఎస్సీ వెల్లడించిన గ్రూప్-1 పరీక్షల ఫలితాలపై నిరుద్యోగల పక్షాన గళం విప్పిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై, ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించిన నెల రోజుల తర్వాత అట్రాసిటీ కేసు నమోదుచేయడం అనుమానాలకు తావిస్తున్నది. గత నెల 14న తెలంగాణభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. గ్రూప్-1 పరీక్షల్లో కొంతమంది అభ్యర్థులకు సీక్వెన్స్‌గా ఎక్కువ మార్కులు రావడం, మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ కోడలికి టాప్ ర్యాంక్ రావడంపై పలు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంపై సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అదేరోజు రాములునాయక్ కూడా ప్రెస్‌మీట్ నిర్వహించి తన కోడలు అడ్డదారిలో ర్యాంక్ సాధించలేదంటూ వివరణ ఇచ్చారు. అయితే కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక వివరణ వెలువడలేదు. నెల క్రితం జరిగిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎక్కడా కులం ప్రస్తావన తేలేదు. రాములునాయక్‌తోపాటు ఆయన కోడలిని కూడా గౌరవప్రదంగానే సంబోధించారు. ఇది జరిగిన నెల తర్వాత రాములునాయక్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదుచేయడం, పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండానే పాడి కౌశిక్‌రెడ్డి మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం కక్ష సాధింపు చర్యల్లో భాగమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రాములునాయక్ సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడ నమోదు చేసిన కేసును బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేయడంలో ఆంతర్యం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం దివాలా!

- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌కు 100 సీట్లు ఖాయం
- మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకుతింటున్నారు
- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతుబంధు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి, మే 15 : సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. జనగామ జిల్లా పాలకుర్తిలో గురువారం బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. 16 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాక రైతులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాలకుర్తి నియోజకవర్గం చర్లపాలెం, పోచంపల్లి కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు వడదెబ్బతో మృతి చెందారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీల ఉన్న మీద ప్రేమ రైతాంగంపై లేదని మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని, సెటిల్‌మెంట్లు చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే రైతుబంధు వేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌కు వంద సీట్లు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

కామెడీ పేరుతో ఆటలా?

ఆర్టీసీ సిబ్బందికి ఆటంకాలు కల్పిస్తే చర్యలే: సజ్జనార్

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): కామెడీ పేరుతో, సోషల్ మీడియా రీల్స్ పేరుతో ఫేమస్ కావడానికి ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. 'ఇదేం వెర్రి కామెడీ? సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి ఎన్ని పిచ్చివేషాలైనా వేస్తారా? మీ పాపులారిటీ కోసం నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తారా? ఇక నుంచి ఆర్టీసీ యాజమాన్యం ఏమాత్రం ఉపేక్షించదు, ఇలాంటి సోషల్ మీడియా పిచ్చి మాలోకాలపై పోలీస్ శాఖ సహకారంతో చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది' అని హెచ్చరించారు. ఓ వ్యక్తి బస్ రూట్ గురించి అడిగి.. రీల్స్ పేరుతో ఓ కండక్టర్‌ను ఇబ్బందిపెట్టిన తీరుపై సజ్జనార్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు.

కొడంగల్ లిఫ్ట్ డొల్ల ప్రాజెక్టు

- పనుల ప్రారంభానికి ముందే రూ.100 కోట్ల బిల్లు?
- సాగునీళ్లు ఇచ్చే ఆలోచన సీఎంకు లేదు: చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, మే 15 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఒక డొల్ల ప్రాజెక్టు అని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొడంగల్‌వాసులను మోసం చేయడమే తప్ప ముఖ్యమంత్రికి సాగునీళ్లు ఇచ్చే ఆలోచన లేదని ధ్వజమెత్తారు. ఇక్కడి నీటిని తరలించే ముందు మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలకు ఏ విధంగా సాగునీళ్లు ఇస్తారో తెలియజేయాలని డిమాండ్‌చేశారు. కొడంగల్‌ను సస్యశ్యామలం చేయాలనుకుంటే సమీపంలో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భీమా ప్రాజెక్టులో అంతర్భాగమైన భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్‌కు నీటిని ఎలా తీసుకెళ్తారో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. భూత్పూర్ రిజర్వాయర్ సామర్థ్యం 1.3 టీఎంసీలు ఉంటే కొడంగల్‌కు 90 కి.మీ. పైపులైన్ ద్వారా ఒక టీఎంసీ ఎలా తీసుకెళ్తారన్నారు. ఈ నిర్మాణానికి మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ టెండర్లు దక్కించుకోగా.. పనులు ప్రారంభంగాక ముందే పైపుల నిర్మాణం చేపట్టామంటూ రూ.100 కోట్ల బిల్లు ఎలా పెట్టారని నిలదీశారు. రైతుల భూములకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

అనుమతిలేని పేలుళ్లకు నిరసనగా ధర్నా చేస్తున్న గ్రామస్థులు

ఓసీపీ-2లో బ్లాస్టింగ్ బీభత్సం

- నివాసాలపైకి దూసుకొచ్చిన పెద్ద బండరాళ్లు
- పలువురికి గాయాలు.. భయంతో పరుగులు
- సింగరేణి తీరుపై నాగెపల్లి గ్రామస్థుల ఆగ్రహం
- ప్రధాన రహదారిపై 2 గంటలపాటు రాస్తారోకో

బండరాయి పడటంతో పగిలిన ఇంటి పైకప్పును చూపిస్తున్న బాధితుడు

రామగిరి, మే 15: సింగరేణి రామగుండం-3 డివిజన్ ఓసీపీ-2 వద్ద కెనాల్ మళ్లింపు పనుల్లో భాగంగా సింగరేణి అధికారులు చేపట్టిన బ్లాస్టింగ్ బీభత్సం సృష్టించింది. కాలువలో పెద్ద బండను తొలగించేందుకు అనుమతి లేకుండా బ్లాస్ట్ చేయడంతో సమీపంలోని నాగెపల్లి గ్రామంలో పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రామగుండం-3 డివిజన్ పరిధిలో రామగిరి మండలం నాగెపల్లిలో ఓసీపీ-2ను సింగరేణి అధికారులు విస్తరిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఎస్సారెస్పీ ఎల్-6 కెనాల్ ఉండటంతో మళ్లింపు పనులు చేపట్టారు. పెద్ద బండరాయి అడ్డురావడంతో గురువారం అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేపట్టారు. పేలుడు దాటికి సమీపంలో ఉన్న నాగెపల్లి గ్రామ సీ బ్లాక్ ఏరియాలో నివాసాలపై పెద్ద పెద్ద బండరాళ్లు పడటంతో ప్రజలు ఇండ్ల నుంచి పరుగులు తీశారు. బండరాళ్ల తాకిడికి పలువురికి గాయాలయ్యాయి. నివాసాలపై పడటంతో పైకప్పు రేకులు పగిలిపోయాయి. పేలుళ్లకు నిరసనగా గ్రామస్థులు మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై 2 గంటలపాటు బైఠాయించారు. ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఇండ్లకు మరమ్మతులు చేపట్టి గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందిస్తామని జీఎం సుధాకర్‌రావు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు. డీజీఎంఎస్, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా సింగరేణి అధికారులు ఎలా బ్లాస్టింగ్ చేస్తారని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రశ్నించారు. గ్రామాన్ని సందర్శించి, దెబ్బతిన్న నివాసాలను పరిశీలించారు.

'సర్కారు'లో విద్యార్థులెందుకు తగ్గుతున్నరు?

- ప్రభుత్వ బడుల్లో ఇలా తగ్గడం కలతపడాల్సిన అంశం
- దీనిపై అధ్యయనం చేసి పరిష్కారాలు అన్వేషించండి
- ఎన్‌రోల్‌మెంట్ తగ్గుదలపై కేంద్రం ఆందోళన
- ఎస్ఎస్ఏ బడ్జెట్‌లో రూ. 461 కోట్లకు కోత

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడుల్లో విద్యార్థులు తగ్గుతుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తంచేసింది. ఏటా ఎన్‌రోల్‌మెంట్ పడిపోతుండటంపై ప్రశ్నించింది. చదువుల కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నా.. ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నదని ఆరా తీసింది. ఇది అత్యంత కలతపడాల్సిన అంశమని, దీనిపై సమగ్ర అధ్యయనం చేయాలని, మూల కారణాలను విశ్లేషించాలని రాష్ట్ర విద్యాశాఖకు సూచించింది. సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు(పీఏబీ) 2025-26 నివేదికను కేంద్రం గురువారం విడుదల చేసింది. నివేదికలో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుదలపై కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 42,901 స్కూళ్లుంటే 30,022(70%) ప్రభుత్వ స్కూళ్లే. వీటిల్లో ఎన్‌రోల్‌మెంట్ కేవలం 38.11శాతమే(27.8లక్షల విద్యార్థులే). అదే ప్రైవేట్ స్కూళ్ల సంఖ్య 12,126(28.26%)గా ఉంటే.. వీటిల్లో 44.31లక్షలు(60.75%) విద్యార్థులు చదువుతున్నారు. ఒక్క కరోనా సంవత్సరం(2021-22) మినహాయిస్తే 2018 నుంచి 2024 వరకు సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ గణనీయంగా తగ్గుతున్నది. ప్రైవేట్ స్కూళ్లల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతున్నది. ఈ ధోరణి అత్యంత ప్రమాదకరమని కేంద్రం ఈ నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో గతంలో వెయ్యిలోపున్న జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల సంఖ్య ఇప్పుడు 1,900కు చేరడంపై అసంతృప్తి వ్యక్తంచేసింది.

రూ. 461కోట్లకు కోత..

కేంద్రం సమగ్రశిక్ష నిధులు విడుదల చేసినా రాష్ట్రం సకాలంలో ఖర్చు చేయకపోవడంతో ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ. 461కోట్ల బడ్జెట్‌ను కత్తిరించింది. 2024-25లో రూ.1,948 కోట్లకు ఆమోదం లభించగా, ఇప్పుడు రూ.1,487 కోట్లకే కేంద్రం పరిమితం చేసింది. అంటే రూ. 461కోట్లు తగ్గించింది. రాబోయే విద్యాసంవత్సరానికి రాష్ట్రం రూ.1,564 కోట్లకు ప్రతిపాదనలు సమర్పించగా, కేంద్రం కేవలం రూ. 1,487 కోట్లకే పరిమితం చేసింది. ముఖ్యంగా స్పిల్ ఓవర్ (నడుస్తున్న పథకాలు, కార్యక్రమాలకు) రూ. 628 కోట్లు ఖర్చుచేయాల్సి ఉండగా, రాష్ట్రం కేవలం రూ.238కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. మరో రూ.72కోట్లను సరెండర్ చేయగా, కొత్తగా రూ. 316 కోట్లను స్పిల్ ఓవర్ కింద ఖర్చు చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది.

మాట్లాడుతున్న బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి

న్యాయం జరిగేలా చూడండి

బాసర ఆలయ ప్రధాన అర్చకుడు

బాసర, మే 15 : తనపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించి, న్యాయం జరిగేలా చూడాలని నిర్మల్ జిల్లా బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి పేర్కొన్నారు. గురువారం ఆయన బాసరలో విలేకరులతో మాట్లాడారు. సంప్రదాయంగా వస్తున్న అమ్మవారి అక్షరాభ్యాసాన్ని కాదని, బాసరలో బీజాక్షరం రాస్తున్న ఆంధ్ర స్వాములోరికి విరుద్ధంగా వెళ్తున్నందున తనపై దాడి చేశారని తెలిపారు. బుధవారం సాయంత్రం వాకింగ్ చేస్తుండగా.. ఒక వ్యక్తి తనపై దాడి చేయగా 100 నంబర్‌కు డయల్ చేశానని, ఫోన్ కలవక పోవడంతో అన్న కుమారుడి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. బాసర ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి చేసిన ఘటనలో బాసర దేవస్థానం సిబ్బంది తోపాటు వ్యాసపురి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సన్న బియ్యం వస్తలేవు!

- రేషన్ షాపులకు స్టాక్ సరఫరాలో ఆలస్యం
- ఇంకా 20 లక్షల కార్డులకు అందని బియ్యం
- లబ్ధిదారుల పడిగాపులు.. రేపటి వరకు గడువు పొడిగింపు

హైదరాబాద్, మే 15(నమస్తే తెలంగాణ): రేషన్ బియ్యం సరఫరాలో గందరగోళం నెలకొన్నది. రేషన్ షాపులకు తగినన్ని బియ్యం సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బియ్యం పంపిణీలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రతి జిల్లాల్లోనూ 15-20% బియ్యం తక్కువగా వచ్చినట్టు తెలిసింది. ఈ నెల 15వ తేదీ వరకు ఇంకా 20 లక్షల కార్డుదారులకు బియ్యం అందలేదు. రేషన్‌షాపుల్లో బియ్యం నిల్వలు నిండుకోవడంతో లబ్ధిదారులు షాపుల చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవానికి ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వరకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తారు. ఈ నెల పూర్తి స్థాయిలో బియ్యం సరఫరా కాకపోవడంతో ఈ నెల 17 వరకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 91 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఈ నెలలో ఇప్పటివరకు 70.79 లక్షల కార్డులకు బియ్యం పంపిణీ చేశారు. ఇంకా 20.21 లక్షల కార్డులకు బియ్యం సరఫరా చేయాల్సి ఉన్నది. సన్న బియ్యం అందుబాటులో ఉన్నాయని అధికారులు చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం సమయానికి బియ్యం అందడం లేదు.

మత్స్యకారులకు ఉపాధి భద్రత కల్పించాలి

తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్

మహాధర్నాలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్ ముదిరాజ్

కవాడిగూడ, మే 15: మత్స్యకారులకు వృత్తిరక్షణ, ఉపాధి, జీవిత భద్రత కల్పించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర నాయకుడు పిట్టల రవీందర్ పాల్గొన్నారు. దేశంలో 5 కోట్ల మంది మత్స్యకారవృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారని, చేపలు, రొయ్యల ఎగుమతితో ద